మహా శివరాత్రికి జోరుగా ఏర్పాట్లు

- అందంగా ముస్తాబైన శివాలయాలు
- నీలకంఠుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు


రామకృష్ణానగర్‌లో పూజలందుకోనున్న రామలింగేశ్వరుడు


విద్యుద్దీపాల వెలుగులో సీతంపేట పార్వతీశ్వరాలయం

సీతంపేట: శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి వేడుకల కోసం శివాలయాలన్నీ చూడముచ్చటగా ముస్తాబయ్యాయి. అదేరోజు శని త్రయోదశి, మాస శివరాత్రి కావడంతో మహాశివరాత్రి ప్రత్యేకత సంతరించుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను తాటాకుల పందిర్లు, మామిడాకుల తోరణాలు, పూలదండలు, విద్యుత్ దీపకాంతులతో అందంగా అలంకరించారు. నగరంలో ప్రసిద్ధి చెందిన శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయం, సీతంపేటలోని పార్వతీశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి రోజైన శనివారం తెల్లవారుజాము 4 గంటల నుంచి ఏకవార అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరపనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. శనివారం రాత్రి 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ కాలంలో భక్తుల గోత్రనామాలతో, బియ్యంతో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. శంకరమఠం, అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరుల ఆలయం, మాస్టర్ ఈ.కె.హోమియో వైద్యాలయం, లలితానగర్‌లోని లలితా పీఠంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

లలితా పీఠంలో..

లలితానగర్ లలితా పీఠంలో శనివారం తెల్లవారుజాము నుంచి శివుడికి అభిషేకాలు, ఉదయం 9 గంటలకు అఘోర గౌరీ మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమంలో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.


లలితా పీఠంలో శివలింగం

‘గ్రీవెన్స్’తో సమస్యల పరిష్కారం


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోని గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజల ఆయనకు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అర్జీలను కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరి కొన్ని వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, వి.ప్రసాద్, కంటిపాము కామేశ్వరి, మాజీ కార్పొరేటర్లు బాక్సర్ రాజు, పైడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్థలాల్లో ఆక్రమణల తొలగింపు


కంచరపాలెంలో పొక్లెయిన్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: నిత్యం రద్దీగా మారుతున్న కంచరపాలెం రోడ్డు, తాటిచెట్లపాలెం వీఐపీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం రైల్వే అధికారులు, జీవీఎంసీ సిబ్బంది రైల్వే స్థలాల్లో ఆక్రమణలను తొలగించారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ వంతెన కూడలి నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రైల్వే రహదారికి ఇరువైపులా అక్రమ నిర్మాణాలను రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సారంజి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ లక్ష్మీనారాయణతో కలిసి చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ నేతృత్వంలో సిబ్బంది పొక్లెయిన్‌తో తొలగింపు చర్యలు చేపట్టారు.

ఆ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రహదారులు మరింత విశాలంగా ఉండేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. రహదారిలో రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను ట్రాఫిక్ పోలీసులు తరలించేందుకు కంచరపాలెం ట్రాఫిక్ అధికారులతో మాట్లాడామని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా జయదుర్గ ఆలయ వార్షికోత్సవం


అన్నదానం చేస్తున్న సారిపిల్లి గోవింద్

సీతంపేట: గురుద్వారా సమీపంలోని జయదుర్గా అమ్మవారి ఆలయ మూడో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి అర్చకులు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధను 25వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో బొల్లినేని మాలాద్రి, సారిపిల్లి సంతోష్, బోర ఈశ్వరరావు, సారిపిల్లి గంగరాజు, బోర గోవింద్, బోర శ్రీను, ఆర్.వెంకటకుమారి, వై.కుమారి, అప్పారావు, ఆలయ అర్చకుడు మురళీశర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెగా పాటల పోటీలు రేపు

సీతంపేట: చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మెగా పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గెంబలి జగదీష్, నూకల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. పాల్గొన దలచిన వారు 92479 48184 నంబర్‌లో సంప్రదించి పేరు, వివరాలు సమోదు చేసుకోవాలని వారు కోరారు.

ఆడపిల్లలను చదివించండి


మజ్జివలసలో విద్యార్థిని ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: పదో తరగతి తర్వాత ఆడపిల్లలకు పెళ్లి, మగపిల్లలకు పని కాకుండా ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో చేర్పించి చదివించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. గురువారం ఆమె భీమిలి మండలం మజ్జివలస జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ముందుగా ఉపాధ్యాయుల పనితీరు, రికార్డులు, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు గైర్హాజరైన మజ్జివలసకు చెందిన విద్యార్థులు భవాని, రాజేష్, గణేష్ ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లా డారు. శుక్రవారం నుంచి వారంతా పాఠశాలల్లో ఉండే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది తీసుకోవాలన్నారు. ఆమెతోపాటు భీమిలి డైట్ అధ్యాపకుడు గొట్టేటి రవిరాజు, హెచ్ఎం మురళీమోహన్ పట్నాయిక్, కృష్ణంరాజుపేట ఉపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలంలో యథావిధిగా దుకాణాల ఏర్పాటు


నక్కవానిపాలెంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని ప్రభుత్వ స్థలాల్లో యథావిధిగా బడ్డీకొట్లు ఏర్పాటు చేశారు. ఇటీవల జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సత్యం జంక్షన్ నుంచి నక్కవానిపాలెం వరకు గల ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు, బడ్డీకొట్లను తొలగించిన విషయం తెలిసిందే. ఆ ప్రదేశంలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ చర్యలు చేపట్టిన వారం రోజుల్లోనే కొందరు తమకేం పట్టనట్లు ఆ స్థలాల్లో చికెన్, నూడిల్స్ షాపులు, ఇతర దుకాణాలు నిర్వహిస్తున్నారు.

వైభవోపేతం.. శివపార్వతుల కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

సీతమ్మధార: శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసం, బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం 8 గంటలకు వార్షిక కల్యాణం, శివపార్వతుల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నక్కవానిపాలెంలోని పలు ప్రాంతాల్లో స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. నాదస్వరం, తోడుపెద్దు, కోలాటం, గరిడి సేవలు ఘనంగా జరిగాయి. సాయంత్రం 6.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో వైభవోపేతంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్‌బాబు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, అర్చకులు రామారావు శర్మ, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం


వానప్రస్థ వృద్ధాశ్రమంలో వద్దాది సత్తెమ్మ

మురళీనగర్: నర్సీపట్నం సమీపంలోని కృష్ణదేవి పేట నుంచి వచ్చి నగరంలోని కేజీహెచ్ ప్రాంతంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఒక వృద్ధురాలికి పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమ నిర్వాహకుడు, మేనేజింగ్ ట్రస్టీ రొబ్బి శ్రీనివాసరావు గురువారం ఆశ్రయం కల్పించారు. వద్దాది సత్తెమ్మ(77) పెరాలసిస్‌తో బాధపడుతోంది. ఆమె ఇద్దరు కొడుకులు చనిపోయారు. మనవడు ఉన్నప్పటికీ ఆమెకు అందుబాటులో లేడు. కేజీహెచ్ ప్రాంత వాసులు ఇచ్చిన సమాచారం మేరకు సత్తెమ్మను తీసుకుని వచ్చి ఆశ్రయం కల్పించారు. వృద్ధురాలికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రొబ్బి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించే నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్క్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో షిర్డీసాయిబాబా మందిరం, డాల్ఫిన్ హైట్స్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

అక్కయ్యపాలెం సెక్షన్‌లో..

సీతంపేట: అక్కయ్యపాలెం 11 కేవీ సెక్షన్ పరిధిలో హెచ్‌టీ లైన్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అబిద్‌నగర్, అబిద్‌నగర్ పార్కు, షాదీకానా, బీఎం డబ్ల్యూ షోరూం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్(సాయిబాబా మందిరం వద్ద) ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు


విద్యుద్దీపాలంకరణతో దుర్గాలమ్మ ఆలయం

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాలమ్మకు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో శివలింగం ఆకారంలో దీపాలంకరణ చేపట్టారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాండ్రేగుల రూపావతి, రమణమ్మ, దశమంతుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొల్లేళ్ల ఉత్సవం

జాతరలో భాగంగా శుక్రవారం తొల్లేళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. 19న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. 26న మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) ఉంటుందని తెలిపారు.


శివలింగ ఆకారంలో దీపాలంకరణ

కనకరాజు మృతి కళాకారులకు తీరని లోటు


కనకరాజు (ఫైల్)

సీతమ్మధార: అక్కినేని నాటకోత్సవాల కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి వి.కనకరాజు మృతి కళాకారులకు తీరని లోటు అని బాదంగీర్ సాయి అన్నారు. సురభి సంస్థను తనకు పరిచయం చేసిన కనకరాజు మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞావంతులు కావాలి


సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య కిషోర్‌బాబు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు బహుముఖ ప్రజ్ఞా వంతులుగా మారాలని ఏయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. శివాజీపాలెంలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏస్పెక్ట్రా 2కె23ని ఆయన ప్రారంభించారు. అనంతరం సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించడం వల్ల విద్యార్థులను అన్ని రంగాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడం సాధ్యపడుతుందన్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల క్రమశిక్షణకు, ప్రతిభకు నెలవన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి మాట్లాడుతూ విద్యార్థులు నిర్వాహకులుగా నిర్వహిస్తున్న ఏస్పెక్ట్రా 2కె3లో ఆర్ట్ ఎగ్జిబిషన్, నృత్య ప్రదర్శనలు, క్రీడలు, సాంకేతిక క్విజ్, టెక్ ఎక్స్‌పో, రంగోలీ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.అరుణ, ఎస్.రమాదేవి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విశేష స్పందన

బీచ్ రోడ్డు: విదేశాల్లో విద్యపై అవగాహన కోసం ఎడ్మిమ్ ఎబ్రాడ్ ఎడ్యుకేషన్ గురువారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. గురువారం సిరిపురంలోని ఎడ్మిమ్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఫెయిర్‌కు 50 మంది విద్యార్థులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని సంస్థ డైరెక్టర్ స్నేహ తెలిపారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చన సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల్లా రహదారులు

- రోడ్ల వెంబడి ఇష్టారాజ్యంగా డెబ్రిస్ డంపింగ్
- ఇబ్బంది పడుతున్న స్థానికులు


తాటిచెట్లపాలెం వీఐపీ రోడ్డు నుంచి ధర్మానగర్‌కు వెళ్లే మార్గంలో డంప్‌చేసిన డెబ్రిస్


కంచరపాలెం మలుపు వద్ద భవన నిర్మాణ వ్యర్థాలు

కంచరపాలెం: స్థానిక ప్రధాన రహదారులు డంపింగ్ యార్డుల్లా దర్శనమిస్తున్నాయి. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రోడ్ల దుస్థితి ఘోరంగా మారింది. ఈ మార్గానికి ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలను ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. వాటిపైనే పశువుల కలేబరాలను వేస్తున్నారు. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే రహదారులు, రైల్వే హెల్త్ సెంటర్, బీఎస్‌టీఎస్‌వస్ కాలనీ రోడ్లు డెబ్రిస్‌తో నిండి ఉండటంతో తిక్కవానిపాలెం, ధర్మానగర్ ప్రాంతాల ప్రజలు, ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రోగులు ఇబ్బంది పడుతున్నారు. జంతువుల కలేబరాలతో ఆయా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆయా మార్గాల్లో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు, వాహన చోదకులు వాపోతున్నారు.

ప్రమాదాలకు నిలయం..

నెలలు గడుస్తున్నా.. డెబ్రిస్‌ను తొలగించకపోవడంతో రహదారులు ప్రమాదభరితంగా మారుతున్నాయి. వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చీకటి పడితే వీధిలైట్లు వెలగపోవడంతో నిత్యం పాదచారులు, వాహనదారులు చీకట్లోనే ప్రయాణం సాగిస్తున్నారు. కంచరపాలెం-తాటిచెట్లపాలెం రహదారికి ఇరువైపులా నిత్యం భారీ వాహనాలు పార్క్‌చేసి ఉంచడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి రోడ్ల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపై డెబ్రిస్ వేస్తే చర్యలు



ఇంటి నిర్మాణ వ్యర్థాలను రహదారులపై వేస్తే చర్యలు చేపట్టి వాటి డంపింగ్‌కు వినియోగించిన వాహనాలను సీజ్ చేస్తాం. ఆయా ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలపై సచివాలయ టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ కార్యదర్శులు పర్యవేక్షించేటట్లు ఆదేశిస్తాం. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలేనికి వెళ్లే మార్గం డెబ్రిస్‌ను గుర్తించాం. వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతాం. – ఆర్.జి.వి.కృష్ణ, జోన్-5 కమిషనర్, జీవీఎంసీ

సినిమా షూటింగ్ సందడి

గోపాలపట్నం రైతుబజార్‌లో పరిచయ సన్నివేశాల చిత్రీకరణ


గోపాలపట్నం రైతుబజార్‌లో హీరోయిన్ అయేషాపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్‌లో గురువారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటలకు మొదలైన షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. హీరోగా సీనియర్ నటుడు బ్రహ్మాజీ కొడుకు సంజయ్ రావు(ఓ పిట్ట కథ ఫేమ్), హీరోయిన్‌గా ముంబైకి చెందిన అయేషాల మధ్య పరిచయ సన్నివేశాలను చిత్రీకరించారు. రైతుబజార్‌లో హీరోయిన్ కూరగాయలు కొనడం.. హీరో కోసం వెతుకుతుండటం వంటి సన్నివేశాలను షూట్ చేశారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు వినియోగదారులు, రైతులు ఎగబడ్డారు. కొంత మంది బజారు చేయకుండా ఖాళీ సంచులతో అక్కడే నిలబడి ఆసక్తిగా తిలకించారు. డాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ బ్యానర్‌పై నిర్మాత లివింగ్‌స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మణిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు.

సక్రమంగా చెత్త సేకరణ

జగదాంబ: చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎల్ఎస్ శాస్త్రి అన్నారు. గురువారం సూర్యాబాగ్ జోన్-4 కార్యాలయంలో పారిశుధ్యం సిబ్బంది, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో తడి, పొడి ప్రమాదకర చెత్తను వేరు చేసి తీసుకోవాలన్నారు. క్లాప్ వాహనాలు కచ్చితంగా ఇంటింటికీ వెళ్లాలన్నారు. వాహనాలు వెళ్లలేని ప్రాంతాల్లో ఇళ్ల సమీపంలో వాహనాలు నిలిపి పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరించాలన్నారు. అదే విధంగా యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. సెక్రటరీల పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. రికార్డులు నమోదు చేసుకోవాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, ఏఎంహెచ్‌వో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చేనేత వస్త్రాల మేళా ప్రారంభం


శిల్పారామంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

పీఎం పాలెం: చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి కోరారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన చేనేత ఉత్పత్తులు ఈ స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. స్టాల్స్ నిర్వాహకుడు బి.సురేష్ మాట్లాడుతూ తక్కువ లాభాలతో చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామన్నారు. నాణ్యమైన జంబుఖానాలు, కార్పెట్లు, అన్నిరకాల చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు.